

తనను కలిసిన ఉద్యోగార్థులతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో బీఆర్ఎస్ నేతలు బాల్క సుమన్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, వాసుదేవరెడ్డి, రాకేశ్‌రెడ్డి తదితరులు

2 లక్షల ఉద్యోగాల భర్తీ ఏమైంది?

- నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ ఎక్కడ?
- గ్రూప్-1లో 1:100గా పిలవాలి
- గ్రూప్స్ పోస్టుల సంఖ్య పెంచాలి
- పరీక్షల మధ్య వ్యవధి ఉండాలి
- అభ్యర్థులకు న్యాయం చేయాలి
- లేనిపక్షంలో బీఆర్ఎస్ తరపున పోరాడుతాం: కేటీఆర్ హెచ్చరిక
- మాజీ మంత్రిని కలిసిన గ్రూప్స్, డీఎస్సీ ఉద్యోగార్థులు

హైదరాబాద్, జూన్ 27 (నమస్తే తెలంగాణ): రెండు లక్షల ఉద్యోగాల భర్తీ ఎంతవరకు వచ్చింది? నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ ఎక్కడ? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించినట్టుగా ఉద్యోగాల నోటిఫికేషన్లు విడుదల చేసి, మొదటి ఏడాదిలో రెండు లక్షల పోస్టులు నింపుతామన్న మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. బంజారాహిల్స్ నందినగర్‌లోని తన నివాసంలో కేటీఆర్‌ను గురువారం గ్రూప్స్, డీఎస్సీ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు కలిశారు. విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీల అమలులో అధికార కాంగ్రెస్ పార్టీ విఫలమైనందున ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ తమకు అండగా నిలడాలని కోరారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ ఎన్నో హామీలు ఇచ్చిందని, వాటిని విస్మరిస్తున్నందున తమతోపాటు ప్రజల తరపున పోరాడాలని విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు తమ సమస్యపై నిరుద్యోగులు కేటీఆర్‌కు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా వారితో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నిరుద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చిందని చెప్పారు. వార్షిక జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, ఒక పద్ధతి ప్రకారం నియామకాలు చేపడతామని చెప్పిందని గుర్తు చేశారు. వివిధ నోటిఫికేషన్ల విడుదలపై జాబ్ క్యాలెండర్ పేరిట తెలుగు, ఇంగ్లిష్ దినపత్రికల్లో నాడు పెద్ద ఎత్తున ప్రకటనలు ఇచ్చిందని తెలిపారు. నాటి అడ్వర్‌టైజ్‌మెంట్లను కేటీఆర్ మీడియాకు చూపించారు. గ్రూప్-1కు ఫిబ్రవరి 1, గ్రూప్-2, 3లకు ఏప్రిల్ -1, గ్రూప్-4కు జూన్ ఒకటిన నోటిఫికేషన్ విడుదల చేస్తామని కాంగ్రెస్ జాబ్ క్యాలెండర్‌లో ప్రకటించినట్టు కేటీఆర్ గుర్తుచేశారు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ ఇంజినీర్, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, ప్రజారోగ్యశాఖ, అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీలోని ఉద్యోగాల భర్తీకి మే 1న, అసిస్టెంట్ మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్స్, వ్యవసాయ విస్తరణాధికారుల పోస్టుల భర్తీకి జూన్ 1న, ట్రాన్స్‌కో, ఎక్సైజ్, పోలీస్ కానిస్టేబుళ్ల నోటిఫికేషన్ మార్చి 1, జూనియర్ లెక్చరర్, పాలిటెక్నిక్ లెక్చరర్, డిగ్రీ కాలేజీ లెక్చరర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఫిజికల్ డైరెక్టర్ పోస్టుల నోటిఫికేషన్‌ను ఏప్రిల్ 1న, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్, పంచాయతీ సెక్రటరీలు, మండలస్థాయి సాంకేతిక సిబ్బంది పోస్టుల భర్తీకి జూన్ 1న నోటిఫికేషన్ విడుదల చేస్తామని ప్రకటించిందని తెలిపారు. మెగా డీఎస్సీ అంటూ పది నోటిఫికేషన్లు ఇస్తామన్న మాటలను కాంగ్రెస్ నేతలు నీటి మూటలుగా మార్చేశారని కేటీఆర్ మండిపడ్డారు.

నాడు రేవంత్‌రెడ్డి బీరాలు

గ్రూప్-2లో 2వేల ఉద్యోగాలు పెంచుతామని, గ్రూప్-3లో వేలాది ఉద్యోగాలు పెంచుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాడు ప్రకటించినట్టు కేటీఆర్ గుర్తుచేశారు. కేసీఆర్ చేయలేకపోయారు.. అధికారంలోకి వచ్చాక చేసి చూపిస్తామని బీరాలు పలికారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 7 నెలల్లో రెండే పనులు చేసిందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన గ్రూప్-1లో 503 పోస్టులకు మరో 60 పోస్టులు కలిపారని, డీఎస్సీలో తాము ఇచ్చిన 5,089 పోస్టులకు మరో 5,973 పోస్టులు కలిపి మొత్తం 11,062కు నోటిఫికేషన్ వేశారని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన పోస్టులు 6,033 మాత్రమేనని, వీటి నియామక ప్రక్రియ ఇంకా పూర్తికాలేదని తెలిపారు. ఏటా 2 లక్షల పోస్టులు భర్తీ చేస్తామన్న కాంగ్రెస్.. ఏడు నెలల్లో 6,033 పోస్టులే ఇచ్చినందన, ఇంకా 1,94,000 పోస్టులు భర్తీచేయాల్సి ఉన్నదని చెప్పారు. 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని ప్రకటించుకుంటున్న కాంగ్రెస్ పార్టీ ఒక్కదానికైనా పరీక్ష పెట్టి ఫలితాలు ప్రకటించిందా? అని నిలదీశారు.

గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100గా పిలవాలి

గ్రూప్-1 మెయిన్స్‌కి 1:50 కాకుండా 1:100 నిష్పత్తిలో పిలవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్వయంగా ఇప్పటి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో గ్రూప్-1 అభ్యర్థులను 1:100 నిష్పత్తిలో తీసుకోవాలని డిమాండ్ చేశారని గుర్తుచేశారు. నాడు మీరే డిమాండ్ చేసి ఇవాళ సాంకేతిక కారణాలను సాకులుగా చూపి తప్పించుకోవడం తగదని హితవుపలికారు. పరీక్షలు వరుసగా ఉన్నందున, అభ్యర్థులకు సరిపడా వ్యవధి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు నింపాలని, నిరుద్యోగ భృతి 4000 ఇవ్వాలని, జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని స్పష్టంచేశారు. లేని పక్షంలో ఏ నిరుద్యోగులైతే అధికారంలోకి తీసుకొచ్చారో వారే కథనాయకులై కాంగ్రెస్ పార్టీపై తిరగబడతారని హెచ్చరించారు. నిరుద్యోగులు, విద్యార్థులు, యువతకు మద్దతుగా బీఆర్ఎస్ తరపున శాసనసభలో, శాసనమండలి, రాజ్యసభలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు. ప్రత్యక్ష కార్యాచరణ రూపొందించి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్తామని హెచ్చరించారు. కేసీఆర్ నాడు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎలాగైతే మద్దతు కూడగట్టారో.. నిరుద్యోగులు కూడా తమ హక్కుల కోసం ప్రతి ఎమ్మెల్యేను కలిసి మద్దతు కూడగట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ నేతలు బాల్క సుమన్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, పోటీ పరీక్షల అభ్యర్థులు సింధు, మహేంద్ర, మిత్ర పాల్గొన్నారు.

ఒక్క లెక్చరర్‌లేని కాలేజీలు 25

- 35 శాతం గెస్ట్ లెక్చరర్లతోనే విద్యాబోధన
- నేటికీ వారిని రెన్యువల్ చేయని సర్కార్
- సిబ్బంది లేక విద్యార్థుల 'ప్రైవేటు' బాట
- ప్రైవేటు ఒత్తిడితోనే రెన్యువల్ చేస్తలేరా?
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, జూన్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఒక్క లెక్చరర్ కూడా లేని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 25 వరకు ఉన్నాయని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. అలాంటి కాలేజీల్లో విద్యార్థులు ఎలా చేరుతారని, ఎలా చదువుతారని సర్కారును నిలదీశారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో 35 శాతం గెస్ట్ లెక్చరర్లతోనే విద్యాబోధన కొనసాగుతున్నట్టు చెప్పారు. కాలేజీలు మొదలై నెలరోజులు కావస్తున్నా నేటికీ గెస్ట్ లెక్చరర్లను ప్రభుత్వం రెన్యువల్ చేయలేదని తెలిపారు. ఇంటర్‌లో 1,654 మంది, డిగ్రీ కాలేజీల్లో 1,342 మంది గెస్ట్ లెక్చరర్లను రెన్యువల్ రెన్యువల్ చేయాలని హైకోర్టు కూడా అనుమతి ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రైవేటు విద్యాసంస్థల ఒత్తిడితో గెస్ట్ లెక్చరర్లను రెన్యువల్ చేస్తలేరా? లేదా ప్రభుత్వం పట్టించుకోవడం లేదా? అని ప్రశ్నించారు. లెక్చరర్లు లేకే విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు కాలేజీలకు పంపుతున్నారని చెప్పారు. వారికి వేతన పెంపు తోపాటు ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రెండు విద్యాసంస్థలు వ్యాపార కేంద్రాలుగా, మాఫియాగా మారి కొత్త కాలేజీలు రాకుండా, ప్రైవేటు కాలేజీలను ఎదగకుండా నియంత్రిస్తున్నాయని విమర్శించారు. పేదల విద్యార్థుల భవిష్యత్తుపై అలసత్వం వహిస్తే బీఆర్ఎస్ తరపున పోరాడుతామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, టీఆర్ఎస్‌వీ నాయకుడు తుంగ బాలు పాల్గొన్నారు.

జేఎల్ భర్తీకి సమాంతర రిజర్వేషన్లు

హైదరాబాద్, జూన్ 27 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో లెక్చరర్ల భర్తీకి మహిళా సమాంతర రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్టు గురువారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) తెలిపింది. ఇందుకు సంబంధించిన జేఎల్ పోస్టుల బ్రేక్‌పో సవరణల జాబితాను టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. జూనియర్ లెక్చరర్ల భర్తీకి 2022 డిసెంబర్ 19న నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే.

స్క్రాప్ దుకాణంలో పాఠ్యపుస్తకాలు

- 25 బండిళ్ల ఇంగ్లిష్ మీడియం బుక్స్ విక్రయం
- 6,800కు ఓ వ్యాపారి కొనుగోలు
- ఇద్దరు వర్కర్ల తొలగింపు

అచ్చంపేట, జూన్ 27: ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు చేరాల్సిన పాఠ్యపుస్తకాలు స్క్రాప్ దుకాణంలో ప్రత్యక్షమయ్యాయి. ఈ ఘటన బుధవారం రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటుచేసుకుంది. అచ్చంపేట పట్టణంలోని పాత, ఇనుప సామాన్ల దుకాణంలో గత విద్యా సంవత్సరం 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు సీలు తీయని ఇంగ్లిష్ మీడియం పుస్తకాలు కనిపించాయి. స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వెనుకభాగంలో ఉన్న గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించిన గోదాంలో పుస్తకాలను భద్రపరిచారు. వాటిని అక్కడి నుంచి తీసుకెళ్తుండగా స్థానికులు గమనించారు. పాఠ్యపుస్తకాలు ఎక్కడ కొనుగోలు చేశావని వ్యాపారిని నిలదీయగా.. గోదాం నుంచి 25 బండిళ్లను 6,800 చెల్లించి కొనుగోలు చేశానని చెప్పాడు. ఈ విషయాన్ని స్థానికులు పోలీసులకు చెప్పారు. వాటిని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు విక్రయించిన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకున్నట్టు జిల్లా ఇన్‌చార్జి డీటీడీవో కమలాకర్‌రెడ్డి తెలిపారు. 25 బండిళ్ల పాఠ్యపుస్తకాలు బయట విక్రయించిన వర్కర్లు ధనలక్ష్మి, కాశన్నను విధుల నుంచి తొలగించామని, కలెక్టర్ ఆదేశాల మేరకు గోదాం ఏసీఎంవో తిరుపతయ్యకు షోకాజ్ నోటీస్ జారీ చేశామని వివరించారు. గత ఏడాది పంపిణీ చేసిన తర్వాత మిగిలిన పాఠ్యపుస్తకాలు అచ్చంపేటలోని గోదాంలో నిల్వ ఉంచామని చెప్పారు.

వరదలను ఎదుర్కొనేందుకు ఎస్డీఆర్ఎఫ్ రెడీ

కొత్తగా 'ఆపదమిత్ర' పేరుతో 109 మంది వలంటీర్లు

హైదరాబాద్, జూన్ 27 (నమస్తే తెలంగాణ) : వరదలు, భారీ వర్షాల నుంచి బాధితులను రక్షించేందుకు స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్డీఆర్ఎఫ్) సిద్ధంగా ఉన్నట్టు రాష్ట్ర అగ్నిమాపకశాఖ డీజీ వై నాగిరెడ్డి తెలిపారు. వరదల్లో చిక్కుకున్న పౌరులను రక్షించేందుకు నిజామాబాద్ నుంచి భద్రాచలం వరకు.. గోదావరి పరీవాహంలో రెస్క్యూ బోట్లతో అగ్నిమాపకశాఖ మోహరించనుందని వెల్లడించారు. హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్లో బోట్స్ తో పాటు నీటిని తోడే పంప్స్, లైఫ్ బాయ్స్, లైఫ్ జాకెట్లు ఇతర రెస్క్యూ సామగ్రితో సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించారు. కొత్తగా 'ఆపదమిత్ర' పేరుతో ఇటీవల ఉమ్మడి వరంగల్ జిల్లాలో 109 మంది ఆపదమిత్రలకు శిక్షణ ఇప్పించామన్నారు.

మద్యం మత్తులో ఉపాధ్యాయుడు

- నిర్బంధించిన విద్యార్థుల తల్లిదండ్రులు

ఇల్లెందు రూరల్, జూన్ 27: విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడు మద్యం మత్తులో జ్ఞానం మరిచి ప్రవర్తించాడు. దేవాలయం లాంటి పాఠశాలలో విద్యార్థులను దుర్భాషలాడుతూ వీరంగం సృష్టించాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆ ఉపాధ్యాయుడిని తరగతి గదిలో నిర్బంధించారు. ఈ ఘటన గురువారం భద్రాది జిల్లా ఇల్లెందులో చోటుచేసుకుంది. ఇల్లెందు మండలంలోని ఇల్లెందులపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు కాల్వ సుధాకర్.. గురువారం మద్యం మత్తులో పాఠశాలకు వచ్చాడు. తరువాత తరగతి గదిలో విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఆపై వారిని దుర్భాషలాడాడు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి ఆ ఉపాధ్యాయుడిని తరగతి గదిలో నిర్బంధించి తాళం వేశారు. అతడిపై కాంప్లెక్స్ హెచ్ఎం యాదమ్మ కు ఫిర్యాదు చేశారు. హెచ్ఎం వచ్చి నిర్బంధంలో ఉన్న ఉపాధ్యాయుడిని విడిపించారు.

'కల్యాణలక్ష్మి' జాప్యంపై సర్కారు చెంపచెళ్లు

- హుజూరాబాద్‌లో ఆలస్యంపై హైకోర్టు ఆగ్రహం
- పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయండి
- రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు కోర్టు ఆదేశాలు
- జూన్ 15కి విచారణ వాయిదాకు ఉత్తర్వులు

హైదరాబాద్, జూన్ 26,(నమస్తే తెలంగాణ): కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద లబ్ధిదారులకు ఇచ్చే చెక్కుల పంపిణీలో తీవ్ర జాప్యం, వివక్షపై హైకోర్టు సీరియస్ అయింది. సకాలంలో ఎందుకు ఇవ్వడం లేదో తేల్చాలని ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. హుజూరాబాద్ నియోజకవర్గంలో ఎందుకు చెక్కుల పంపిణీని నిలిపివేశారో వివరాలతో కూడిన అఫిడవిట్ దాఖలుకు ఆదేశాలు జారీ చేసింది. హుజూరాబాద్ నియోజకవర్గంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేయకుండా కావాలని ప్రభుత్వ అధికారులు జాప్యం చేస్తున్నారంటూ బీఆర్ఎస్‌కు చెందిన స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన కేసు విచారణను ఈ నెల 15కు హైకోర్టు వాయిదా వేసింది. చెక్కుల పంపిణీలో జాప్యంపై రాష్ట్ర వ్యాప్తంగా లబ్ధిదారులు ఆగ్రహంతో ఉన్నారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన వివాహాలకు అదనంగా ఇస్తామన్న తులం బంగారం ఇవ్వాల్సిందేనని వారంతా డిమాండ్ చేస్తున్నారు. హుజూరాబాద్ నియోజకవర్గం మాదిరిగా ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు ఉన్న చోట చెక్కుల పంపిణీలో వారికి ప్రాతినిధ్యం కల్పించడం లేదని రాష్ట్ర వ్యాప్తంగా ఆరోపణలు వస్తున్నాయి. అక్కడ మంత్రి ప్రోద్బలంతోనే తనను అడ్డుకున్నారని కౌశిక్‌రెడ్డి కోర్టుకు చెప్పారు. ఇలా కాంగ్రెస్ ప్రభుత్వం పలు చోట్ల, దీంతోపాటు ఇతర పథకాలపైనా పక్షపాత ధోరణి అవలంబించడంపై నిరసనలు వ్యక్తమవుతూనే ఉన్నాయి.

కోర్టు ఆదేశాలతో కదలిక

హైకోర్టు ఆదేశాలతోనే ప్రభుత్వ అధికారుల్లో కదలిక వచ్చి హుజూరాబాద్ నియోజకవర్గంలో చెక్కులు పంపిణీ చేస్తామని చెప్పాల్సి వచ్చింది. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేస్తామని, ఇప్పటికే 71 మంది లబ్ధిదారుల చెక్కులను బ్యాంకులకు పంపించామని ప్రభుత్వం తరపున అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్ చెప్పారు. ప్రభుత్వ జీవో ప్రకారం అర్హులైన అందరికీ చెక్కులను అందజేస్తామని కోర్టుకు ప్రభుత్వం సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వచ్చింది. దీంతో ప్రభుత్వ హామీని హైకోర్టు రికార్డుల్లో నమోదు చేసుకొని, పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఎమ్మెల్యేలతోనే కల్యాణలక్ష్మి చెక్కులిప్పించాలి

ప్రభుత్వానికి హైకోర్టు మొట్టికాయలు: కౌశిక్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 27 (నమస్తే తెలంగాణ): కల్యాణలక్ష్మి చెక్కులను స్థానిక ఎమ్మెల్యేలే పంపిణీ చేయాలని హైకోర్టు స్పష్టంగా చెప్పిందని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తెలిపారు. హైకోర్టు మెట్టికాయల తర్వాతైనా ప్రభుత్వం అరాచకాలు ఆపాలని సూచించారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయనివ్వటంలేదని కోర్టులో పిటిషన్ వేశానని చెప్పారు. కోర్టు స్థానిక ఎమ్మెల్యే పంపిణీ చేయవచ్చని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని, ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. జీవోను ఫాలో కావాల్సిందే అని కోర్టు చెప్పిందని గుర్తు చేశారు. సీఎం ఆదేశాలతో మంత్రి పొన్నం పంపిణీని అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

సింగరేణిలో జంగ్ సైరన్

మొదటిపేజీ తరువాయి...

ప్రాంత నాయకులు, పార్టీ సీనియర్ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ సింగరేణిని ప్రైవేటీకరించేందుకే కేంద్రం తెలంగాణ బొగ్గు గనులను వేలం వేసిందని ఆరోపించారు. కేంద్రంతో సీఎం రేవంత్ కుమ్మక్కై బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. లాభాల్లో ఉన్న సింగరేణికి బొగ్గు గనులు కేటాయించకుండా నష్టాల్లోకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. నష్టాలు చూపి పెట్టుబడులను ఉపసంహరించాలని చూస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వరంగ సంస్థలతో కేసీఆర్ ఉద్యమ కాలం నుంచే పనిచేస్తున్నారని, సకల జనుల సమ్మెలో సింగరేణి ప్రాధాన్యాన్ని దేశం గుర్తించిందని తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థల బలోపేతం అనేది బీఆర్ఎస్ విధానమని వెల్లడించారు. ఇప్పుడు కాంగ్రెస్, బీజేపీ కలిసి బొగ్గు గనులను వేలంకు పెట్టాయని ధ్వజమెత్తారు. సింగరేణి కష్టాల్లో ఉంటే కార్మికులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్న విషయం మర్చిపోవద్దని స్పష్టం చేశారు. సమావేశంలో మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జడ్పీ చైర్మన్ పుట్ట మధు, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దివాకర్‌రావు, గండ్ర వెంకటరమణారెడ్డి, కోరుకంటి చందర్, హరిప్రియ నాయక్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌తో సమావేశమైన సింగరేణి మాజీ ఎమ్మెల్యేలు, కార్మిక నేతలు

బొగ్గు పెల్ల కూడా తియ్యనియ్యం: రాజిరెడ్డి

తెలంగాణలోని ప్రతి బొగ్గు పెల్ల సింగరేణిదే నని, వేరే ఎవరైనా వస్తే ఉరుకునేది లేదని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి హెచ్చరించారు. చిన్న బొగ్గు పెల్లను కూడా తీయనీయబోమని, వేలానికి ఎవరైనా వస్తే జాగ్రత్త అని హెచ్చరించారు. తెలంగాణభవన్‌లో కేటీఆర్‌తో సమావేశానంతరం మీడియాతో మాట్లాడుతూ.. బొగ్గుగనుల వేలానికి వ్యతిరేకంగా జూలై 1 నుంచి ప్రత్యక్ష ఆందోళనకు శ్రీకారం చుడతామని ప్రకటించారు. సింగరేణి బొగ్గు గనుల తవ్వకానికి ప్రైవేటు కంపెనీలు వస్తే సహించబోమని తేల్చిచెప్పారు. బీజేపీ వైఖరి, కాంగ్రెస్ విధానాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, వేలం పాటలో కిషన్‌రెడ్డి, భట్టి విక్రమార్క నవ్వుతూ మాట్లాడుకున్నారని ఫైర్ అయ్యారు. నామినేషన్ విధానంలో సింగరేణికి బొగ్గు గనులు ఇవొచ్చన్న విషయాన్ని గుర్తించాలని తెలిపారు. బొగ్గు గనులను దక్కించుకోవడానికి ఎలాంటి పోరాటాలకైనా సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో కోల్‌బెల్ట్ ఏరియా ఎమ్మెల్యేలను కలుస్తామని, బొగ్గు గనులను సింగరేణికే ఇచ్చేలా ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసేలా ఒత్తిడి తీసుకొస్తామని వెల్లడించారు. ఇందిరాపార్కు వద్ద, వచ్చే పార్లమెంట్ సమావేశాల సమయంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తామని తెలిపారు. సమావేశంలో టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ, నాయకులు నూనె కొమురయ్య, మాదాసి రామ్మూర్తి, కే సురేందర్‌రెడ్డి, లక్ష్మణ్, శంకర్, జాఫర్ హుస్సేన్ పాల్గొన్నారు.

గనుల వేలంపై గడువు పొడిగించండి!

కేంద్రానికి లేఖ రాయనున్న రాష్ట్ర ప్రభుత్వం?

హైదరాబాద్, జూన్ 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణలోని గనుల వేలానికి కేంద్ర గనులశాఖ విధించిన గడువును పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరనున్నది. ఈ మేరకు కేంద్రానికి లేఖ రాయాలని భావిస్తున్నది. రాష్ట్రంలోని 11 గనుల్లో ఈ నెల 30లోగా కనీసం ఆరింటికైనా వేలం నిర్వహించాలని గడువు నిర్ణయించింది. గనులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే తమ ఆధిపత్యాన్ని కోల్పోయే అవకాశం ఉన్నదని భావిస్తున్న ప్రభు త్వం.. గడువు పెంచాలని, ప్రభుత్వరంగ సంస్థలకే కేటాయించాలని లేఖలో కోరాలని భావిస్తున్నట్టు అధికార వర్గాల సమాచారం. ఢిల్లీ నుంచి రాగానే గనులశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి, కేంద్రానికి లేఖ రాయాలని నిర్ణయించారు. ఈ నెల 21న వాణిజ్య మైనింగ్ కోసం పదో దఫా వేలాన్ని కేంద్రం ప్రారంభించింది. దీనికి కేంద్ర గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరయ్యారు. ఈ అంశం.. అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ దుమారానికి వేదికైంది.

- మధ్యాహ్న భోజనంలో పురుగులు

నిర్మల్ జిల్లా నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో దాదాపు 50 మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. నిల్వ ఉంచిన బియ్యం కావడంతో భోజనంలో పురుగులు వస్తున్నాయని మధ్యాహ్న భోజన కార్మికులు తెలిపారు. పాఠశాల సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. దీంతో విద్యార్థులు భోజనాన్ని ఇంటి నుంచి తెచ్చుకొంటున్నారు. -నర్సాపూర్(జి)

5,962 మందికి స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి

- మల్టీజోన్ -2లో టీచర్లకు ప్రమోషన్స్
- భాషాపండితులు, పీఈటీల అప్‌గ్రేడేషన్ సంపూర్ణం
- రాష్ట్రంలో మొత్తం 18,942 టీచర్లకు పదోన్నతులు
- ఇక మిగిలింది ఎస్జీటీల బదిలీలే

హైదరాబాద్, జూన్ 27 (నమస్తే తెలంగాణ) : టీచర్ల బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా గురువారం మరో 5,962 మంది టీచర్లు పదోన్నతులు పొందారు. మల్టీజోన్ -2లో హైదరాబాద్, రంగారెడ్డి సెకండరీ గ్రేడ్ టీచర్లు, భాషాపండితులు, పీఈటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు. టీచర్ల బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా రాష్ట్రంలో మొత్తం 18,942 మంది టీచర్లకు పదోన్నతులు దక్కాయి. వీరిలో గ్రేడ్ -2 భాషాపండితులు, పీఈటీలు 4,200కుపైగా ఉన్నారు. దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ గ్రేడ్ -2 భాషాపండితులు, పీఈటీల అప్‌గ్రేడేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. తాజా పదోన్నతుల్లో వీరికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు. ఉత్తర్వులు అందుకొన్న టీచర్లంతా గురువారమే కొత్త స్థానాల్లో చేరారు. అయితే గురువారంతో టీచర్ల పదోన్నతుల ప్రక్రియ ముగిసింది. ఇక రెండు మల్టీజోన్లలో సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీలు చేపట్టాల్సి ఉన్నది. దీంతో టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ముగియనున్నది. అయితే, మల్టీజోన్ -2లోని 12 జిల్లాల్లో 5,962 మందికి పదోన్నతులు లభించగా, రెండు కంటే ఎక్కువ పదోన్నతులు పొందిన వారు 806 మంది ఉన్నారు. వీరు ఒకే పోస్టును ఎంపికచేసుకోవాల్సి ఉండటంతో ఆయా పోస్టులు మిగిలే అవకాశం ఉన్నది. ఆపోస్టులను ఇతరులతో భర్తీచేయాలని టీచర్లసంఘాల నేతలు కోరుతున్నారు.



మహబూబ్‌నగర్ డీఈవో నుంచి స్కూల్ అసిస్టెంట్ పదోన్న